క్లుప్తంగా

టీటీడీ చైర్మన్ రాజీనామా చేయాలి

ఉండి: తిరుపతిలో జరిగిన తొక్కిసలాటపై బాధ్యత వహిస్తూ చైర్మన్ బీఆర్ నాయుడు రాజీనామా చేయాలని వైఎస్సార్ సీపీ నాయకుడు బడుగు బాలాజీ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. భక్తులకు సరైన సదుపాయాలు కల్పించకపోవడమే కాకుండా వారికి ఉత్తర ద్వార దర్శన టోకెన్లు సరైన విధంగా అందజేయలేని స్థితిలో టీటీడీ ఉందని ఆయన మండిపడ్డారు. ఏదీ జరక్కపోయినా ఏదో జరిగిపోయిందని తిరుపతి లడ్డూపై ప్రగల్భాలు పలికి నిందలు మోపిన వారంతా ఇప్పుడు భక్తులు ప్రాణాపాయంలో ఉంటే ఎందుకు నోరుమెదపడం లేదో? చెప్పాలని ప్రశ్నించారు. న్యాయంగా విచారణ చేయించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట


నంద్యాల సీతారామయ్య

ఆకివీడు: వైకుంఠ ఏకాదశి టోకెన్ల జారీ నేపథ్యంలో తిరుపతిలో జరిగిన ఘటన ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే జరిగిందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడే నంద్యాల సీతారామయ్య పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం, టీటీడీ పాలకవర్గం టీటీడీ సంప్రదాయాల్ని విస్మరించి ప్రవర్తిస్తున్నారనడానికి ఈ ఘటనే నిదర్శనమని పేర్కొన్నారు. తొక్కిసలాటలో ఆరుగురు ప్రాణాలు విడవడం దారుణమని సీతారామయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ ఇలాంటి సంఘటనలు ఏ దేవాలయాల్లో, ప్రార్థనా మందిరాల్లో, పవిత్ర ప్రదేశాల్లో జరగకుండా ప్రభుత్వం, అధికార యంత్రాంగం పటిష్టమైన సౌకర్యాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు


విజేతకు బహుమతి అందిస్తున్న అనంతలక్ష్మి సత్యవతి దేవి

కాళ్ల: మండలంలోని సీసలి గ్రామంలో ఉన్న షిర్డీసాయిబాబా ఆలయంలో మహిళలకు సంక్రాంతి ముగ్గుల పోటీలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మహిళలు వేసిన ముగ్గులు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దేవస్థానం ట్రస్టు బోర్డు చైర్ పర్సన్ తోరం అనంతలక్ష్మి సత్యవతి దేవి, ఆకివీడు పవన్ సాయి శ్రీనివాస ఏజెన్సీస్ సి.సతీష్ కుమార్, నాగఅనుపమ దంపతులు ఆధ్వర్యంలో గెలుపొందిన, పాల్గొన్న మహిళలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అఖండ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

గాంధేయంపై కవితా రచన పోటీలు

భీమవరం: మహాత్మాగాంధీ 77వ వర్ధంతిని పురస్కరించుకుని ఈనెల 30వ తేదీన సర్వోదయ మండలి ఆధ్వర్యంలో సీనియర్ రచయితలకు గాంధేయంపై కవితా రచన పోటీలు నిర్వహించనున్నట్లు సర్వోదయ మండలి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధేయం మార్గదర్శకం అనే అంశంపై ఒక పేజీకి మించకుండా రచనలు పంపించాలన్నారు. 25 ఏళ్లు దాటిన సీనియర రచయితలు మాత్రమే అర్హులన్నారు. రచనలను ఈనెల 22వ తేదీలోపు గా జిల్లా సర్వోదయ మండలి, గాంధీ కస్తూరిబా భవనం, శ్రీరాంపురం, భీమవరం-2 అనే చిరునామాకు పోస్టు ద్వారా పంపించాలన్నారు. విజేతలకు 30వ తేదీన బహుమతులు అందజేస్తామని ప్రసాదరాజు తెలిపారు.

వేంకటేశ్వర స్వామి సన్నిధిలో జేసీ దంపతులు


జేసి రాహుల్ కుమార్ రెడ్డి దంపతులకు ఆశీర్వచనం అందిస్తున్న అర్చకుడు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లా జాయింట్ కలెక్టర్ టీ రాహుల్‌కుమార్ రెడ్డి దంపతులు పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని శ్రీపద్మావతి వేంకటేశ్వర స్వామి వారిని గురువారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూజలను నిర్వహించి జేసీ దంపతులకు వేద ఆశీర్వచనం అందించారు.

ఆకట్టుకున్న సంగీత కచేరి

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం త్యాగరాజ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 106వ త్యాగరాజ ఆరాధనోత్సవాలలో భాగంగా చెన్నైకు చెందిన ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసురాలు భావరాజు శ్రీవిద్య రమణ్ చేసిన గాత్ర కచేరి కచేరి ఆకట్టుకుంది. 10వ తేదీన అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో భారతనాట్యం ప్రదర్శన జరుగుతుందని చెరుకువాడ సోదరులు తెలిపారు.

సంక్రాంతి సందళ్లు

భీమవరం, ఉండి నియోజకవర్గాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో గురువారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా సంబరాలను భోగి మంటలు వెలిగించి ప్రారంభించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో సందడి చేశారు. బొమ్మల కొలువు సెట్టింగ్‌లు ఆకట్టుకున్నాయి. డూడూ బసవన్నల విన్యాసాలు, కోలాటం, హరిదాసులు, కొమ్ముదాసరులు, సోదెమ్మ, పిట్టలదొర, దేవతామూర్తుల వేషధారణలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్


వీరవాసరం: హైస్కూల్లో భోగి మంట వేస్తున్న దృశ్యం


ఆకివీడు: బాలుర జెడ్పీ ఉన్నత పాఠశాలలో భోగి మంట వేస్తున్న దృశ్యం


ఆకివీడు: దుంపగడపలో ఉన్నత పాఠశాలలో చిన్నారుల సందడి


భీమవరం (ప్రకాశం చౌక్): సర్ సీవీ రామన్ స్కూల్లో సంక్రాంతి సంబరాలు


భీమవరం: విష్ణు స్కూల్లో గొబ్బెమ్మల పాటలు పాడుతున్న విద్యార్థులు


ఆకివీడు: వివిధ వేషధారణల్లో విద్యార్థులు

పదిలమైన ఫలితాల కోసం


ఏలూరుపాడులో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం


పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ రవీంద్ర

- పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణతకు ప్రత్యేక ప్రణాళిక
- ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ప్రత్యేక తరగతులు

కాళ్ల: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు సిద్ధమవుతున్నారు. ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళికతో విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా, ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థి భవిష్యత్‌కు పదవ తరగతి పరీక్షలు కీలకం. ఈ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తే ఇంటర్, డిగ్రీలలో మంచి కోర్సులు ఎన్నుకుని వాటిలో రాణించడానికి అవకాశం ఉంటుంది. భవిష్యత్‌లో విద్యార్థులు ఎంచుకునే ప్రతి గ్రూపునకు పదవ తరగతి మార్కులు కీలకం ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ చదివిస్తున్నారు. నియోజకవర్గంలో 2173 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. కాళ్ల-600, ఉండి-455, ఆకివీడు-581, పాలకోడేరు-537 మంది పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణులయ్యేలా విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసింది. దీనికి అనుగుణంగా ప్రతి జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రతిరోజు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడం ఎప్పటికప్పుడు స్లిప్ టెస్టులు, ఎసైన్‌మెంట్లు ఇస్తూ ఉపాధ్యాయులు విద్యార్థులను పదో తరగతి పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు.

వంద రోజుల ప్రణాళిక

ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు పదో తరగతి విద్యార్థులకు 100 రోజుల ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తూ విద్యార్థులను నిరంతరం పర్యవేక్షించి వారి సామర్థ్యాన్ని అంచనా వేసి ఉత్తీర్ణత సాధించాలా చర్యలు చేపడుతున్నారు. విద్యలో వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. వారిలో పరీక్షలు అంటే భయాన్ని తొలగించి అవగాహన కల్పించి వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు ప్రయత్నిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం 8.15 నుండి 9.15 వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సబ్జెక్టుల వారిగా రోజుకో సబ్జెక్టుని ఎన్నుకుని ఆయా సబ్జెక్టులు భోధన చేస్తూ సమ్మేటివ్ 1, సమ్మేటివ్ 2 పరీక్షలు నిర్వహించి విద్యార్థుల్లో నైపుణ్యాన్ని గుర్తించే విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రతి పాఠశాలలోనూ 10వ తరగతిలో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలనే సంకల్పంతో ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు.

ప్రణాళికలు అమలు చేస్తున్నాం



నియోజవర్గంలో అన్ని పాఠశాలలో వందరోజుల ప్లాన్ అమలు చేస్తున్నాం. పది పరీక్షలకు సిద్ధపడే విద్యార్థులకు ఈ ప్లాన్ ఎంతో ఉపయోగపడుతుంది. పాఠ్యాంశాలపై విద్యార్థులకు ఏమైనా సందేహాలు ఉంటే వెంటనే వాటిని ఉపాధ్యాయులు నివృత్తి చేస్తున్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రథమ స్థానం వచ్చే విధంగా ఉపాధ్యాయులు అందరూ కలిసి కష్టపడి పనిచేస్తున్నారు.

– రవీంద్ర, ఎంఈఓ, కాళ్ల

నేటి నుంచి రాయకుదురులో నాటిక పోటీలు

వీరవాసరం: శ్రీకృష్ణదేవరాయ నాటక కళాపరిషత్ పంచమ జాతీయస్థాయి ఆహ్వాన నాటక పోటీలు ఈనెల 10, 11, 12 వ తేదీల్లో రాయకుదురులో నిర్వహిస్తున్నట్లు కళాపరిషత్ కార్యదర్శి డాక్టర్ అడబాల లక్ష్మీనారాయణ (రాజు) గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు స్థానిక మంతెన ప్రసాద్ వాటర్ ప్లాంట్ ప్రాంగణంలో జరుగుతాయని పేర్కొన్నారు.

హోంమంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

కాళ్ల: అంబేడ్కర్ పై చేసిన అవమానకరమైన వ్యాఖ్యలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని ఉండి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వేగేశ్న వెంకటగోపాలకృష్ణంరాజు డిమాండ్ చేశారు. గురువారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. అమిత్ షా వెంటనే అంబేడ్కర్‌కి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ భీమవరం ఇన్‌చార్జి అంకెం సీతారాం, సోడదాసి గంగయ్య, తాళ్లూరి రాజకుమార్ పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను తక్షణం అమలు చేయాలి


ఎన్నికల హామీలను అమలు చేయాలంటూ సీపీఐ నేతల నిరసన

భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలను తక్షణం అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని బుధవారం మార్కెట్ సచివాలయం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేదలకు పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు స్థలం, గృహ నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని సచివాలయ కార్యదర్శి సత్యనారాయణకు అందించారు. ఈ కార్యక్రమంలో వైవి ఆనంద్, లక్ష్మీ గణపతి తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ ఉత్సవాలకు కలెక్టర్‌కు ఆహ్వానం


కలెక్టర్ నాగరాణికి ఆహ్వానపత్రం ఇస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): ఈనెల 13 నుంచి నిర్వహించనున్న భీమవరం శ్రీమావుళ్లమ్మ మహోత్సవాలకు విచ్చేయాల్సిందిగా కలెక్టర్ చదలవాడ నాగరాణిని ఉత్సవ కమిటీ కోరింది. ఈమేరకు కలెక్టర్‌కు ఆహ్వాన పత్రిక అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ నెలరోజలపాటు జరగనున్న ఈ ఉత్సవాల్లో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా అధికారులతో కలిసి సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీకి సూచించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కార్యవర్గ అధ్యక్షుడు రామాయణం గోవిందరావు, ఉపాధ్యక్షుడు కొప్పుల సత్యనారాయణ (సత్తిబాబు), కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు


రోగులకు పండ్లు, దుప్పట్లు అందిస్తున్న దృశ్యం

కాళ్ల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండల వైద్యాధికారి డాక్టర్ సరాబు సునీల్, డాక్టర్ సునీత ఆధ్వర్యంలో 30 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో భాగంగా శ్రీదత్తపాదుకా క్షేత్రం తరపున పీవీ నాగేశ్వరరావు గర్భిణులతో పాటు వారితో వచ్చిన సహాయకులకు, రోగులకు భోజనాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా 'దేవుని సన్నిధి సహవాసం – కువైట్' వారి ఆధ్వర్యంలో గునుపూడి సుశీల, రాపాక గణపతి వారి సహకారంతో రోగులకు, గర్భిణులకు దుప్పట్లు, పండ్లు అందించారు.

దొంగతనాల నివారణకు చర్యలు తీసుకోవాలి


ఆర్డీఓ దాసి రాజుకు వినతిపత్రం ఇస్తున్న రాయిపేట వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

నరసాపురం: పట్టణంలోని రాయిపేట ప్రాంతంలో ఇటీవల కాలంలో వరుస దొంగతనాలు ఆందోళన కలిగిస్తున్నాయని రాయిపేట వెల్ఫేర్ అసోసియేషన్ పేర్కొంది. ఈ మేరకు అసోసిషన్ ప్రతినిధులు గురువారం నరసాపురం డీఎస్పీ డాక్టర్ డి.శ్రీవేద, నరసాపురం ఆర్డీఓ దాసి రాజులను కలిసి దొంగతనాలను అరికట్టాలని వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు అందే రంగారావు మాట్లాడుతూ ఇటీవల కాలంలో రాయిపేటలో వరస దొంగతనాలు జరుగుతున్నాయని చెప్పారు. దొంగతనాలు జరిగిన వివరాలను తేదీలతో సహా వినతిపత్రంలో పేర్కొమని వివరించారు. పోలీసుకు ఫిర్యాదు చేసినా కనీసం కేసులు కూడా నమోదు చేయడం లేదని వాపోయారు. గతంలో ఇలాంటి ఘటనలు ఎప్పుడూ జరగలేదన్నారు. రాత్రిపూట గస్తీ ఏర్పాటు చేసి ఇకపై దొంగతనాలు జరగకుండా రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మీసాల సత్యనారాయణ, కావలి నాని, తమ్మిశెట్టి బాబ్జి పాల్గొన్నారు.

నేటి నుంచి రీ యూనియన్ క్రికెట్ మ్యాచ్‌లు

భీమవరం: పట్టణంలోని డీఎన్నార్ కళాశాల గన్నబత్తులవారి క్రీడా మైదానంలో ఈ నెల 10, 11, 12 తేదిల్లో రీ యూనియన్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శేషు, త్రిమూర్తులు, ఎస్ కృష్ణమోహన్, శేఖర్‌రాజు, పి లక్ష్మీనారాయణ గురువారం విలేకర్లకు చెప్పారు. 1980వ సంవత్సరం నుంచి భీమవరంలో రాణించిన క్రికెట్ క్రీడాకారులు బెంగళూరు, మద్రాస్, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా కలిసి సంక్రాంతి సంబరాల్లో భాగంగా క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో సీనియర్ రంజీ క్రీడాకారులు, సీనియర్ ఆటగాళ్లు 8 టీములుగా ఏర్పడి 3 రోజుల పాటు పోటీల్లో పాల్గొంటారన్నారు. పోటీల నిర్వహణకు డీఎస్ రాజు, గ్రంధి చల్లారావు సహకరిస్తున్నట్లు చెప్పారు.

జూద క్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు


ఉండి: చిలుకూరులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై నసీరుల్లా


కాళ్ల: పెదఅమిరంలో మాట్లాడుతున్న ఎస్సై శ్రీనివాసరావు

ఉండి: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జూదం, కోడి పందేలు నిర్వహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎండీ నసీరుల్లా తెలిపారు. గురువారం మండలంలోని ఉండి ఎంపీడీఏ కార్యాలయంలోనూ, చిలుకూరు, వెలివర్రు, పెదపుల్లేరు, చిన్నపుల్లేరు, కలిసిపూడి తదితర గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ ప్రజలకు జూదం, కోడిపందేలపై అవగాహనా కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ కె.నాగార్జున, ఎంపీడీఓ ఎస్.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

పెదఅమిరంలో..

కాళ్ల: సంక్రాంతి పండుగ నేపథ్యంలో కోడి పందేలు పేకాట వంటి జూద క్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని కాళ్ల ఎస్సై ఎస్. శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో రెవెన్యూ, పోలీసు సిబ్బంది జూద క్రీడలపై గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సంక్రాంతి పండుగను సంప్రదాయ బద్ధంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు, ఆర్ఐ లక్ష్మి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జూద క్రీడలకు పాల్పడితే కఠిన చర్యలు

పెనుగొండ: సంక్రాంతి సందర్భంగా ఎటువంటి జూదక్రీడలకు, కోడి పందేలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పెనుగొండ ఎస్సై కె.గంగాధర్ హెచ్చరించారు. గురువారం పెనుగొండ తహసీల్దారు కార్యాలయంలో కోడిపందేల, జూద క్రీడల నిషేధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జూద క్రీడల వల్ల కుటుంబాల ఆర్థిక పరిస్థితి ఛిన్నాభిన్నం అవుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు జి.అనితకుమారి, డీటీ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్‌పై విస్తృత ప్రచారం కల్పించాలి

భీమవరం (ప్రకాశం చౌక్) : ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంపై విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వెండర్స్ అపార్ట్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు, రెసిడెన్షియల్ కాలనీ అసోసియేషన్ సభ్యులతో జేసీ అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పీఎం సూర్యఘర్‌కు సంబంధించి విద్యుత్ శాఖ కార్యాలయాల్లో కంట్రోల్ రూము, టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో వివిధ వెండర్స్ ఏర్పాటు చేసిన సోలార్ పరికరాలను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, ఎస్ఈ రఘునాధబాబు, ఈఈలు వెంకటేశ్వరరావు, నరసింహమూర్తి, మధుకుమార్ పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి సీఎస్ఆర్ ఫండ్స్ అందించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లా అభివృద్ధికి పారిశ్రామికవేత్తలు సీఎస్ఆర్ ఫండ్స్ అందజేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. గురువారం జిల్లా కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో జిల్లాలోని వివిధ పరిశ్రమల ప్రతినిధులతో సీఎస్ఆర్ ఫండ్స్‌పై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ పరిశ్రమల అధినేతలు ప్రభుత్వ నిబంధనల మేరకు జిల్లాలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు రెండు శాతం నిధులను తప్పనిసరిగా అందజేయాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

భీమవరం: విద్యారంగం పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న ఉదాసీన వైఖరికి నిరసనగా ఈనెల 11వ తేదీన విజయవాడలో నిర్వహిస్తున్న ధర్నాను జయప్రదం చేయాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ శ్రీనివాసరావు, ఆర్.ఎరకేశ్వరావు కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. జీవో నెం 117ను రద్దుచేయకుండా ప్రభుత్వం తాత్సారం చేయడాన్ని డీటీఎఫ్ తీవ్రంగా ఖండిస్తుందని పేర్కొన్నారు. నూతన పీఆర్‌సీ కమిటీ ఏర్పాటుచేసి 30 శాతం ఐఆర్ ప్రకటించాలని తదితర డిమాండ్లతో ధర్నా నిర్వహిస్తున్నట్లు వివరించారు.

విగ్రహాల ఏర్పాటుపై వివాదం

పాలకోడేరు: మండలంలోని గొరగనమూడి స్వామి జ్ఞానానంద హైస్కూల్లో విగ్రహాల ఏర్పాటు పై వివాదం నెలకొంది. గత మూడు నెలల క్రితం హైస్కూల్ ప్రాంగణంలో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అంబేడ్కర్ విగ్రహానికి ముందు స్వామి జ్ఞానానంద, మూర్తి రాజు విగ్రహాలు ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. దీంతో గ్రామంలోని దళితులు ఆ విగ్రహాల ఏర్పాటు వల్ల అంబేడ్కర్ విగ్రహం సరిగ్గా కనపించదని అభ్యంతరం వ్యక్తం చేస్తూ గురువారంధర్నా నిర్వహించారు. ఆ విగ్రహాల ఏర్పాటు చేస్తే అంబేడ్కర్ విగ్రహంతో సమానంగా ఏర్పాటు చేయాలని పట్టుబట్టారు. దాంతో సర్పంచ్ గొట్టుముక్కల శివరామరాజు(శివాజీ రాజు) రంగంలోకి దిగి దళితులు స్కూల్ ఉపాధ్యాయులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీతో చర్చలు జరిపి దళితులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేస్తామని నిర్ణయించడంతో సమస్య సద్దుమణిగింది.